విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - దేవరపల్లి: తెలుగు పత్రికా రంగంలో 70 వసంతాలు పూర్తి చేసుకున్న విశాలాంధ్ర ది సువర్ణ అక్షరాలతో లిఖింపదగ్గ చరిత్ర గలదని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మంగళవారం దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విశాలాంధ్ర తెలుగుదినపత్రిక నూతన సంవత్సర 2023 క్యాలెండర్ ను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆచంట సత్యనారాయణ, చిన్నం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకం నూతనోత్తేజం

విశాలాంధ్ర - కాకినాడ : క్రీడాకారులకు మనం ఇచ్చే ప్రోత్సాహం వారిలో నూతన ఉత్తేజాన్ని ఇస్తుందని తెలుగు దేశం రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి, హెల్త్ అవేర్ అధ్యక్షులు, మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షులు, అసోసియేషన్ ఆఫ్ అలైన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న వేళంగి క్రికెట్ టీంకు హెల్త్ అవేర్ సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షులు అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు టీమ్ సభ్యులకు టీ షర్టు కానుకగా ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ వేళంగి క్రికెట్ టీంకు చాలా మంచి పేరు ఉందని టీంలో సభ్యులు ప్రతి ఒక్కరు ఆటలో మంచి సామర్థ్యం కలిగి ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ అవేర్ సంస్థ కార్యదర్శి చప్పిడి పద్మావతి, బొడ్డు శ్రీనివాసరావు, అలై వనుం ఉపేంద్రనాథ్, టీమ్ సభ్యులు వై రాజు, దడాల సతీష్, మురళి పఠాన్, నలీన్, సాయి విరాట్, వంశి, మోహన్, సుదర్శన్, సుబ్బు, నవీన్, ఎస్ సూర్య, రవి, శేఖర్, కె. సూర్య, ఎస్. రామ్, రాజు, క్రాంతి, విజయ్, సాయిరాం పాల్గొన్నారు.

30 సెంటీమీటర్ల కణితి తొలగించిన వైద్యులు

విశాలాంధ్ర - అనపర్తి : కొన్నేళ్లుగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతూ ఎన్నో ఆసుపత్రులకు తిరిగి నిరాశ చెందిన వంకాయల నాగమణి(ద్వారపూడి-36) నరకయాతన అనుభవించింది. చివరికి స్థానిక సిడిఆర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా నాగమణికి వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో కణితి ఉందని నిర్ధారించారు. దీంతో మంగళవారం సిడిఆర్ డాక్టర్లు కర్రి సునీల్ కుమార్ రెడ్డి బాంధవి దంపతులు నాగమణి కడుపులో ఉన్న 30 సెంటీమీటర్లు కణితి తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, బాంధవి దంపతులు మాట్లాడుతూ లాప్రోస్కోపిక్ సర్జరీ ద్వారా కాంప్లెక్స్ ఓవరిన్ సిస్ట్ తొలగించినట్టు తెలిపారు. దీర్ఘకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నానని కణితి తొలగింపుతో సంతోషంగా, ఆరోగ్యంగా ఉన్నానని నాగమణి ఆనందం వ్యక్తం చేశారు.

గుణాత్మకవిద్య అందించడంలో ఉపాధ్యాయులు బాధ్యత వహించాలి

విశాలాంధ్ర-గోపాలపురం : గుణాత్మకమైన విద్యను అందించుటలో ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని ఎంఈఓ జి. శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మండల స్థాయిలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో 2023- 24 విద్యాసంవత్సరానికి పాఠశాల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ 2021- 22 విద్యా సంవత్సరానికి సంబంధించి చేసిన ప్రణాళికలలో రికార్డులను వాటి లక్ష్యాలను అందజేయాలని తెలిపారు. 23- 24 సంవత్సరానికి సంబంధించి సమగ్ర సమాచారం తో ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయం ఉట్టి పడేలా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - సీతానగరం : సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి బాబు ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పూర్తి సాంప్రదాయక దుస్తులను ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. వీటిలో భాగంగా ఉదయం నుంచి ముగ్గుల పోటీలు సాంప్రదాయక వస్త్ర ధారణ ప్రదర్శన, భోగి మంటలు, హరిదాసు కీర్తనలతో రోజంతా కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. అనంతరం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశామని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

61 కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామ శివారులో జాతీయ రహదారి ప్రక్కన బాబా రాందేవ్ హొటల్ వద్ద 61 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు, ఎస్సై గణేష్ కుమార్‌లు తెలియజేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన శివబాలన్ మరియు ముగిలిరాసన్ ఇద్దరు వ్యక్తులు (డ్రైవర్లు) చెన్నై నుండి రౌతులపూడి వెళ్లి తిరిగి వస్తుండగా బొర్రంపాలెం గ్రామం వద్ద కారు పార్కు చేసి ఉండగా మూడు బస్తాల గంజాయిని, కారును, స్వాధీనం చేసుకున్నారు. 61 కేజీ గంజాయి విలువ 1 లక్ష 83 వేల రూపాయలు ఉంటుందన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్, సర్పంచి సారిపల్లి లోవలక్ష్మి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని గత నాలుగు ఏళ్లలో వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్, జెడ్పీటీసీ రాజేశ్వరి, సొసైటీ చైర్మన్‌లు కొప్పన గంగారావు, చక్కపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, GUDAPATI VENKETESWARA RAO (Old Name) S/o. GUDAPATI GANGARAJU, R/o. D.No.1-68, Near Coparate Bank, Vaddiparru, Atreyapuram, East Godavari District - 533235, A.P., have changed my name to GUDAPATI VENKATESWARA RAO. Hereafter my name is known as GUDAPATI VENKATESWARA RAO.

మార్చి నాటికి గృహాలు సిద్ధం చేయాలి

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా తొలి దశలో ప్రారంభించిన గృహాలన్నింటినీ రానున్న మార్చి నెల నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు కృతికా శుక్లా..హౌసింగ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మండల ప్రత్యేక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణాల పురోగతిపై అన్ని మండలాల అధికారులు, మున్సిపల్ కమిషనర్లుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణాలు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనుల్లో పురోగతి చూపాలన్నారు. తొలి దశలో జిల్లాలో 18,003 గృహ నిర్మాణాలు ప్రారంభించినట్టు తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 10,300 గృహాలు పూర్తి అయ్యాయని ఇంకా మిగిలిన గృహాలన్నింటిని మార్చి నెల ఉగాది నాటికి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఇందుకు సమన్వయ శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు కృషి చేయాలన్నారు.

కొమరగిరి లేఅవుట్‌పై సమీక్ష: జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా.. మంగళవారం కలెక్టరేట్‌లో కాకినాడ అర్బన్ పరిధిలోని నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద లబ్ధిదారులకు కేటాయించిన కొమరగిరి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలు, ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న ఇళ్లు, ఇంకా గ్రౌండింగ్ కానివాటి వివరాలపై సమీక్షించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మీబీ కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు పి.నారాయణమూర్తి, కెఎన్‌వీ ప్రసాద్‌రావు, కాంట్రాక్టర్లు తదితరులు హాజరయ్యారు.

జేఎన్టీయూకేను సందర్శించిన ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుహెచ్ మాజీ ఉపకులపతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మాజీ ఛైర్మన్ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మాజీ సభ్యుడు వై వెంకట్రామిరెడ్డి జెఎన్‌టియుకెని సందర్శించారు. ఉపకులపతి జివిఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన వెంకట్రామిరెడ్డి జెఎన్‌టియుకె డైరెక్టర్‌లు, అధికారులు, విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియుకె అధికారులు సాంకేతిక సంస్కరణలను ప్రాధాన్యతినిస్తూ అభివృద్ధిపై దృష్టి సారించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉపకులపతి మాట్లాడుతూ వై. వెంకట్రామిరెడ్డి ఏడు సంవత్సరాల పాటు జెఎన్‌టియు హైదరాబాద్ ఉపకులపతిగా పనిచేసిన సమయంలోనే జెఎన్‌టియుహెచ్ విశ్వవిద్యాలయ క్యాంపస్‌ను మాసబ్‌ట్యాంక్ నుండి కూకట్‌పల్లికి మార్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎల్ .సుమలత, ఓఎస్‌డి డి.కోటేశ్వరరావు, డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్‌లు, యుసిఇకె ప్రిన్సిపాల్, సీనియర్ ప్రొఫెసర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, రిటైర్డ్ ప్రొఫెసర్‌లు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 2023 సంవత్సరం క్యాలెండర్‌ను రాజమహేంద్రవరం జట్లు లేబర్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు, ఏఐటీయూసీ తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ కే రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు నల్ల రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులు పనులు లేక ఉన్న కొద్దిపాటి పనికి గిట్టుబాటు కూలి రాక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఈ వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారన్నారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత వృత్తి మీద ఆధారపడి జీవించిన అనేక కుటుంబాలకు ప్రభుత్వ విధానాల వల్ల కష్టాలు అనుభవించవలసిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఏఐటియుసి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ కే రాంబాబు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు వారి పోరాటాలకు అండగా ఉంటారని అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో చేనేత కార్మిక సంఘం నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జట్ల లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, పి దేవుడు బాబు, జి వెంకట్రావు, కే దుర్గాప్రసాద్ ,కాళ్ల అప్పలనాయుడు, ఆర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల పేరిట సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - కొవ్వూరు : గతంలో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేసినా, మహిళల విలువ తెలుసుకుని వారి పేరున సంక్షేమ పథకాలను అందించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని రాష్ట్ర హెూం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు.మంగళవారం చాగల్లు మండలం ఉనగట్ల గ్రామంలో "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా హోమ్ మంత్రి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత సంక్షేమ పథకాలను అందుకున్న లబ్దిదారులకు గత మూడున్నర సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వం అందచేసిన ఆర్థిక ప్రయోజనం పై ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకాలు అమలు చేసినా మహిళలు పేరునే అమలు చేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున పథకాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, తహశీల్దార్ శ్రీనివాస్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత వన్య తోట పంటల సమన్వయ పథకంపై సమావేశం

విశాలాంధ్ర - అంబాజీపేట : అంబాజీపేటలోని డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యా లయం, ఉద్యాన పరిశోధన స్థానంలో మంగళవారం పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ బి. శ్రీనివాసులు అధ్యక్షతన అఖిల భారత వన్య తోట పంటల సమన్వయ పథకం షెడ్యూల్ కుల ఉప ప్రణాళిక 2022-23లో భాగంగా షెడ్యూల్డ్ కులాల కొబ్బరి రైతులతో సమావేశం నిర్వహించారు. గత నెలలో నిర్వహించిన కొబ్బరి, కోకోలో ఆధునిక సాగు పద్ధతులు అనే కార్యక్రమంలో, జీవనియంత్రణ బదనికలు, జీవనియంత్రణ శిలీంద్రాలను పంపిణీ చేసిన లబ్ధి దారులను, పున:సమావేశపరచి, ప్రస్తుత తరుణంలో కొబ్బరిని ఉధృతంగా నష్టపరచే తెల్లదోమ సమగ్ర సస్యరక్షణ పై చర్చాగోష్ఠి నిర్వహించి, వారి అనుభవాలను పంచుకొని, సందేహాలను నివృత్తి చేసారు. అనంతరం చర్చాగోష్ఠి కార్యక్రమంలో కొబ్బరిలో జీవనియంత్రణ పద్ధతిలో కీటక యాజమాన్యం గురించి, కీటక విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బివి చలపతిరావు, శాస్త్రవేత్త డాక్టర్ వి. అనూష వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త ఎ. కిరీటి కొబ్బరిలో అంతర పంటల ప్రాధాన్యత, సస్యరక్షణ గురించి తెలియచేసారు. తెగుళ్ళ యాజమాన్యం పై పరిశోధనా స్థానం తెగుళ్ళ విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ వి. గోవర్ధన రావు, బి. నీరజ అవగాహన కల్పించారు. అనంతరం జీవనియంత్రణ బదనికలు, జీవనియంత్రణ శిలీంద్రాలను విడుదల చేయు పద్ధతులను క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. కొబ్బరిలో వచ్చే గానోడెర్మా తెగులు, నల్లమచ్చ తెగులు మరియు మొవ్వకుళ్ళు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి మరియు సూడోమోనస్ జీవశిలీంధ్ర నాశినులను క్షేత్రస్థాయిలో ఉపయోగించు విధానంపై ప్రదర్శనల ద్వారా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట, అమలాపురం, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలంలోని కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

జీఓ1 రద్దు చేసే వరకూ పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్

విశాలాంధ్ర - అమలాపురం : అన్ని రాజకీయ ప్రజాసంఘాలను కలుపుకుని జిఓ నెంబర్.1 రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్ పిలుపు నిచ్చారు. మంగళవారం అమలాపురం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం కె. సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో దేగా ప్రభాకర్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి బూజుపట్టిన చట్టాన్ని దులిపి అమలు చేస్తున్న జగన్ మోహన్ రెడ్డి అప్రజాస్వామిక నియంతృత్వ విధానాలు విడనాడాలన్నారు. జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న జీఓను సంక్రాంతి మంటల్లో తగులబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ కుమార్ సింగ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి చప్పిడి లక్ష్మణ గోపాలకృష్ణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రాపాక పవన్, విద్యార్థి సంఘం నాయకులు వి. చందు, యన్. ప్రశాంత్ పాల్గొన్నారు.

జగనన్న ఇంటికి ఐదు లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం సీపీఐ సమావేశం కొమ్ము సత్యవతి అధ్యక్షతన సీపీఐ కార్యాలయంలో జరిగింది. తొలుత పార్టీ సీనియర్ నాయకులు ఏసు రాజు పతాకఆవిష్కరణ చేసారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె సత్తి బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పార్టీ మహాసభల నేపథ్యం దేశ-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు వివరించారు. పార్టీ కార్యాకలాపాలు తెలియజేస్తూ ముఖ్యంగా జగనన్న ఇళ్ల నిర్మాణ లబ్దిదారులకు ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాన్ని జనవరి 16 నుంచి రాష్ట్ర పార్టీ పిలుపు అమలు కొరకు విశాఖ ఉక్కు పరిరక్షణ కొరకు జనవరి 23, 24 డివిజన్ స్థాయి నిరాహార దీక్షలు 25న ఛలో కలక్టరేట్ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. విభజన హామీలు అమలుకు విద్యార్థి, యువజన సంఘాల బస్ యాత్ర జనవరి నెలాఖరు నాటికి అమలాపురం చేరి అక్కడ నుండి రావులపాలెం మీదుగా రాజమహేంద్రికి వెళుతుందని ఆ కార్యక్రమం జయప్రదం గావించాలని పిలుపు నిచ్చారు. సమావేశం వేదిక పై పార్టీ నాయకు రాలు మోకా హేమా, కె. రామకృష్ణా ఆశీనులయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. రవి సమావేశాన్ని కో ఆర్డినేట్ చేసారు. కర్రి, రామిరెడ్డి, సత్తి రెడ్డి, కె శామ్, యాకోబులు హాజరయ్యారు. కొత్తపేట నియోజకవర్గం 5 గురు సభ్యులతో కన్వీనింగ్ కమిటీ ఏర్పాటైంది. నియోజకవర్గ కన్వీనర్‌గా కె. రామకృష్ణ, కమిటీ సభ్యులుగా కర్రి రామిరెడ్డి, మోకా హేమ, కొమ్ము శామ్యై ఏసు రాజు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. రవి, నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వాక పల్లిలో మంగళవారం ఉపాధి హామీ పనికి సంబంధించిన పుంత రోడ్డు నిర్మాణము పనిని డ్వామ పిడి అడపా వెంకటలక్ష్మి పరిశీలించారు. వేతనదారులకు కొలతల ప్రకారం పని చేసిన పనులకు రోజుకు 257 రూపాయలు చొప్పున ఉపాధి వేతనం తీసుకొనవలసినదిగా తెలియజేశారు. కూలీలు పనికి వచ్చేటప్పుడు గునపం, పార, తట్ట, తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ ఎవిబి నాయుడు, గ్రామ సర్పంచ్ రోంగల నాగేశ్వరరావు, సాంకేతిక సహాయకులు, భాను ప్రకాష్, క్షేత్ర సహాయకులు సుబ్రహ్మణ్యం, మరియు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు **దాకవరపు ఈశ్వరి, W/o. వెంకటేశ్వరరావు,** డో.నెం. 18-25-9, వార్డు నెం.39, రామచంద్రరావు పేట, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా ఇచ్చిన సంజాయిషీ ప్రకారం..

గతంలో నా క్లయింటుకు శ్రీ కట్టా సత్యకృష్ణ మోహనరావు, S/o. పట్టాభి రామారావు, డో.నెం. 34-2-31, శీలం సూరన్న వీధి, మంగళవారపుపేట, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా వారికి మధ్య జరిగిన లావాదేవీ అనగా 26-8-2016 సం॥ తేదీన రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రూ. 19,43,000/- కిమ్మత్తు గల స్థిరాస్తి స్వాధీన క్రయ అగ్రిమెంటుతో కూడిన ఇర్రివోకబుల్ పవర్ ఆఫ్ అటార్నీగా రిజిష్టర్ కాబడిన షెడ్యూలు దాఖలా ఆస్తి అనగా డో.నెం. 18-25-9లో గల ఇల్లు, ఇంటి స్థలం, అందలి పూర్తిగా 100 చదరపు గజములలో గల దాబా ఇల్లుకు సంబంధించి వ్రాసుకున్న రిజిష్టర్ దస్తావేజు అనగా 26-8-2016వ తేదీన దస్తావేజు నెం. 9039/2016 గా రిజిష్టర్ కాబడినటువంటి ఆస్తికి నా క్లయింటు ప్రిన్సిపల్ అయినందున సదరు దస్తావేజు నెం. 9039/2016 అమలు జరుపుటకు ఇష్టం లేనందున నా క్లయింటు సదరు దస్తావేజును అనగా జనరల్ పవర్ ఆఫ్ అటార్నీని పూర్తిగా రద్దుపర్చడమైనది. గాన ఇకపై పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ జరిపే ఎట్టి లావాదేవీలు చెల్లనేరవని పత్రికా ముఖంగా యావన్మందికి తెలియపర్చడమైనది. ఒకవేళ ఏమైనా లావాదేవీలు జరిగినచో అవి చెల్లవని, పూర్తిగా నష్టపోవుదురు అని తెలుపుచూ, అట్టి నష్టములు వాటిల్లకుండా ఉండేలాగున ఇకపై దస్తావేజు నెం. 9039/2016లో గల యావత్తు అంశములు రద్దుపర్చడమైనది అని సదరు దస్తావేజు పవర్ ఆఫ్ అటార్నీ యాక్ట్ 1882 విరుద్ధంగా వ్రాయబడినందున రద్దుపర్చడమైనది అని తెలియపరచడమైనది.

స్థిరాస్తి షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చెందిన రాజమహేంద్రవరం 10వ వార్డు, ప్రస్తుతం 39వ వార్డులో గల కృష్ణా నగర్‌లో నున్నటువంటి టి.ఎస్. నెం. 723 రులోని పూర య. 6-04 ట్లు భూమిలో ఉత్తరదిశ య. 2-00 ట్లు భూమి గాక మిగిలిన య. 4-04 ట్లు భూమిలో ఉత్తరదిశ య. 2-00 ట్లు భూమిని లే-అవుట్ కాబడిన ప్లాను దాఖలా ప్లాటులో నెం. 31రు ప్లాటు స్థలములో తూర్పుదిశ భాగమున్నూ, నెం.32రు ప్లాటు స్థలములో పడమరదిశ భాగమున్నూ వెరసి చ॥ 100 గ॥లు స్థలంలోని డోరు నెం. 18-25-9 రు గల దాబాయిల్లు స్థలం వగైరాలు ఇందుకు ఏకప్రతిగా హద్దులు.

తూర్పు: ఈ ఆస్తి తాలూకా గోడను చేరి పల్లెల మంగమ్మ గారి స్థలం (అ.45-0లు). **దక్షిణం:** ఈ ఆస్తి తాలూకా గోడను చేరి ఇమ్మడిశెట్టి రఘునాథరావు గారి ప్రహరీ గోడ (అ. 20-0లు). **పడమర:** ఈ ఆస్తి తాలూకా గోడను కోలా కొండమ్మ గారి ఇంటి స్థలం (అ. 45-0లు). **ఉత్తరం:** అ. 30-0లు వెడల్పు గల రోడ్ (అ. 20-00లు).

జి.సత్యనారాయణ, అడ్వకేటు
రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం
తేది:01-01-23 సెల్: 9381677687

ఆంధ్ర పేపర్ మిల్ కార్మికుల భవిష్యత్తుపై పోరాటం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కార్మికుల సమస్యలపై 23న రాజమండ్రి బంద్

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు

యాజమాన్యం మొండి వైఖరి విడనాడే వరకు పోరాటం ఆగదు

కార్మిక నేత శ్రీకాకుళపు శివరామ సుబ్రహ్మణ్యం

24 తర్వాత ఎప్పుడైనా కార్మికుల సమ్మె

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి అరుణ్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్ర పేపర్ మిల్ కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పరంపర టూను రద్దు చేయాలని యాజమాన్యం మొండి వైఖరి నశించాలని కోరుతూ 8 కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల రోజులపాటు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నట్లు యూనియన్ కార్మిక సంఘాలు ప్రకటించాయి. మంగళవారం సాయంత్రం యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరుగుతుంది. రేపటి నుండి రిలే దీక్షలు 14 రోజులు జరుగుతాయి. 14న భోగిమంటలలో యాజమాన్యం ఇచ్చిన పరంపర టు జీవోను దగ్ధం చేయనున్నారు. 13న అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. 15న పేపర్ మిల్లు వద్ద కార్మికులతో మానవహారం జరుగుతుంది. 18న పేపర్ మిల్ గేటు వద్ద జనరల్ బాడీ జరుగుతుంది. 20న నగరంలో అన్ని పార్టీలు కార్మిక సంఘాలతో భారీ ర్యాలీ జరుగుతుంది. 23న రాజమండ్రి బందు జరుగుతుంది. 24న తర్వాత ఎప్పుడైనా కార్మికుల సమ్మె చేపట్టనున్నారు.

గుడ్ మార్నింగ్ రాజమండ్రిలో ఎంపీ భరత్

విశాలాంధ్ర-రాజమండ్రి : మంగళవారం ఉదయం 36వ వార్డు తుమ్మలావ సాయిబాబా గుడి వద్ద నుండి ప్రారంభమైన 'గుడ్ మార్నింగ్ రాజమండ్రి' కార్యక్రమంలో ఎంపీ భరత్ పాల్గొన్నారు. కాలినడకన అన్ని వీధులలో పర్యటించారు. ప్రధానంగా పారిశుధ్య పనులపై ఆ వార్డు ప్రజలను ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఒక చోట డ్రెయినేజీలో నీరు నిలిచిపోయి పూడిక పేరుకుపోవడంతో ఎంపీ దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. వెంటనే మున్సిపల్ ఎస్ఈని ప్రశ్నించారు. మురుగు నీరు పారేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవలసిందిగా ఎంపీ భరత్ ఆదేశించారు. విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండటాన్ని చూసి ఎలక్ట్రికల్ ఏఈకి వైర్లు సరిచేయమని ఆదేశించారు. కుక్కల బెడదపై పలువురు ఎంపీ దృష్టికి తీసుకురాగా ఎంహెచ్వో కు దీనిపై తగు చర్యలు తీసుకోమని ఎంపీ భరత్ సూచించారు.

అగ్ని ప్రమాద బాధితులకు గోరంట్ల ఆర్థిక సాయం

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : :కడియం మండలం దోసాలమ్మ కాలనీలో అగ్ని ప్రమాదంలో ఇళ్ళు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితులను రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు10 వేల రూపాయలు ఆర్థిక సాయంతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు వారికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు, వారి పిల్లలకు నూతన వస్త్రాలు, దుప్పట్లు, వంట సామాన్లు వారికి అందజేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కడియం ఎం.పీ.పీ వెలుగుబంటి ప్రసాద్, తెలుగుదేశం పార్టీ మహిళా కార్యదర్శి మజ్జి పద్మావతి,మాజీ ఎంపీపీ మార్గాన్ని సత్యనారాయణ, కడియం మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆదిరెడ్డి సంక్రాంతి కానుకలు పంపిణీ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : స్థానిక 45వ డివిజన్ ఇందిరా నగర్‌కు చెందిన పేద ప్రజలకు సహకారం అందించాలన్న సంకల్పంతో ఆదిరెడ్డి ఆర్మీ సభ్యులు ఆనంద్ పొట్ట ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ముఖ్య అతిథిగా హాజరై సుమారు 200 మందికి సంక్రాంతి పండుగకు కావాల్సిన వస్తువులతో పాటు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పేదల పరిస్థితిని అర్థం చేసుకుని సంక్రాంతి పండుగ రోజు వారి కళ్లల్లో ఆనందం చూడాలన్న ధ్యేయంతో ఆనంద్ పొట్ట మంచి కార్యక్రమం చేపట్టారని అభినందించారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - గోపాలపురం : సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని మండలంలోని వేళ్ళచింతలగూడెం గ్రామంలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలలో గెలుపే ధ్యేయంగా 32 టీములు తమ తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం దేవరపల్లి, గోపాలపురం పోలీస్ టీంలు పాల్గొని గెలుపే ధ్యేయంగా రెండు టీములు చూపించాయి. మొదటి బహుమతిగా రూ.1,50,000 ద్వితీయ బహుమతిగా రూ. 75,000 తృతీయ బహుమతిగా 30,000 మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.10000 బెస్ట్ బ్యాట్స్‌మెన్ కు రూ.5000, బెస్ట్ బౌలర్ కు ఇవ్వనున్నట్లు ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ అధినేత గంట మధు కృష్ణ తెలిపారు. 8 జిల్లాల జట్లు పురుషులు,6 జిల్లాలకు చెందిన బాలికలు జట్లు రెండవ రోజు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 50,000 వేలు రెండో బహుమతిగా 40,000 మూడో బహుమతిగా 30,000 కారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీలలో కోటర్ ఫైనల్ లోకి చేరిన జంగారెడ్డిగూడెం 11 జట్టుకు మెయిన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని జట్టు కెప్టెన్‌కు నిర్వాహకుడు కొర్లపాటి రాజా చేతుల మీదుగా అందజేశారు.

12వ డివిజన్‌లో గడపగడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం 12వ డివిజన్ స్వర్ణాంధ్ర కాలనీ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్ళ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, పలువురు మాజీ కార్పొరేటర్లు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులకు సూచించారు.

దేవుడిని ఆత్మతో, సత్యముతో ఆరాధించాలి

- శాసన మండలి చైర్మన్ మోషన్ రాజు

విశాలాంధ్ర - గణపవరం : దేవుడిని ఆత్మతోను సత్యముతోను ఆరాధించి దేవుని దీవెనలు పొంది అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు అన్నారు. మంగళవారం గణపవరంలో ఏసు క్రీస్తు ప్రభువు ఆరాధన ప్రార్థన ప్రకటన గుడారము చర్చి 13వ వార్షికోత్సవానికి మోషన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఏసు క్రీస్తుని ఆరాధిస్తున్నారని కొనియాడారు. దేవుని ప్రేమ గొప్పదాని దేవుని యందు భయభక్తులతో ఉండాలన్నారు. క్రైస్తవుల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలను అందజేస్తున్నారని , పాస్టర్లకు నెలకు గౌరవ వేతనం 5000 రూపాయలు ఇస్తున్నారని ఆయన అన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) మాట్లాడుతూ ఏసు క్రీస్తు కృప ద్వారా అనేకమంది అభివృద్ధి చెందారని కొనియాడారు. వైఎస్ఆర్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్ , గణపవరం చర్చి పాస్టర్ రెవ" ఎ.రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, దండు రాము, కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలూరు : దేశవ్యాప్తంగా గత సంవత్సరం నవంబర్లో జీవిఆర్ డయాబెటిస్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో స్థానిక బాలాజీ నగర్ శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరి చారని ప్రధానోపాధ్యాయులు మంత్రి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికి డయాబెటిస్ వ్యాధిపై అవగాహన ఉండాలని, ఆ మహమ్మారి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ సుధాకర్, ప్రైమరీ ఇన్చార్జి స్వాతి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి జ్యోతి, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సిఎస్ఎన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర -భీమవరం: డాక్టర్ సి ఎస్ ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు నాట్యం, బొమ్మల కొలువు, ఫుడ్ స్టాల్స్ మొదలు కార్యక్రమాలతో క్యాంపస్ మొత్తం కొలహలంతో నిండిపోయింది. ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ రంగోలి డాన్స్ సింగింగ్ పోటీల్లో విద్యార్థులు జోష్ పుట్టించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ, గవర్నింగ్ బాడీ మెంబర్ వడుపు గోపి, ప్రిన్సిపల్ డాక్టర్ సకుమళ్ళ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ రమణ, రాజ్ కమల్, ప్రభాకర్ రావు, జితేంద్ర, కృష్ణారావు, సుధా, లావణ్య, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భాష్యం స్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - చింతలపూడి: స్థానిక భాష్యం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలతో పాఠశాల ఆవరణాన్ని అలంకరించారు. రంగవల్లుల పోటీ నిర్వహించారు. గంగిరెద్దులతో ఆటలు ఆడించారు. హరిదాసులు వేషాలు ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువు, రకరకాల పిండి వంటలతో ప్రదర్శనలతో ఎంతో అంగరంగ వైభవంగా ఈ సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కంచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి రైతులకు పంటల పండుగ, మగువులకు ముగ్గుల పండుగ, కన్నె పిల్లలకు గొబ్బిళ్ళ పండుగ, సర్వ జనావళికి భోజనాలు పండుగని సంక్రాంతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో కోడిపందాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కే. స్లీవ జోజి తెలిపారు. మంగళవారం మండలంలోని నాగుల గూడెం, పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం, టెక్కిన వారి గూడెం,అమ్మపాలెం, నిమ్మల గూడెం ,కట్టవ పాదలవారిగూడెం,తిరుమలాపురం కేతవరం గ్రామాలలో తహశీల్దార్ స్లీవ జోజి ఆయా గ్రామాల సర్పంచ్ లు,ఎంపిటిసి లు,వార్డు సభ్యులు పంచాయితీ కార్యదర్శులు, పోలీసులు, వి.ఆర్.ఓ లు,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్థులతో గ్రామ సభలు నిర్వహించారు. నేడు, రేపు మండలంలోని అన్ని గ్రామాలలో తహశీల్దార్,ఎంపిడిఓ లను రెండు వేర్వేరు టీములుగా నియమించి గ్రామ సభలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించినట్లు తహశీల్దార్ తెలిపారు.

హిందీ భాషా దినోత్సవం

విశాలాంధ్ర - పెంటపాడు : స్థానిక డిఆర్ జి ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యాం బాబు, హిందీ భాష ప్రత్యేకతను ,ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియ జేశారు. ఈ సందర్భంగా హిందీ అభ్యసించే విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పిఎస్ బ్రహ్మాచారి, హిందీ విభాగం అధ్యాపకురాలు ఆర్ రమాదేవి, ఎన్ ఎస్ ఎస్ అధికారి జే విజయ్ బాబు, మిగిలిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నెం ఒకటి రద్దు చేయాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : రాష్ట్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ఇటీవల తీసుకువచ్చిన జీవో నెం ఒకటి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడుతూ సమా వేశాలు, ప్రదర్శనలు నిర్వహించ రాదంటూ జీవో ఇవ్వటం సరైన చర్య కాదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తీరు ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడుతూ పౌరహక్కులు హరించే విదంగా ఉన్న ఆ జీవోను వెంటనే రద్దు చేయాలనీ లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బొగరి వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ అధ్యక్షులు కురిమెల్ల శ్రీను, కార్యదర్శి ఉద్యమాలు మజ్జి శ్రీను, అఫ్రోజ్, కె. రమేష్, లక్ష్మాన్, ఆది, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో అందరికీ సంక్షేమం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వెలిచేరు గ్రామ శివారు ఊదాలమ్మ గౌడ పాలెంలో కొత్తపేట నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 19 లక్షల రూపాయలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటి ఇంటికి కుళాయి కనెక్షన్ల ఏర్పాటు, 15 లక్షల రూపాయలతో డ్రెయినేజీ నిర్మాణం, 6 లక్షల రూపాయలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు, 1.5 లక్షల రూపాయలతో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం షెల్టర్ ఏర్పాటు కొరకు శంకుస్థాపనలు నిర్వహించి, గడప గడపకూ వెళ్ళి, ప్రతీ కుటుంబానికీ ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరా యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బోణం సాయిబాబా, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహశీల్దార్ డీవీఎన్ అనిల్ కుమార్, వ్యవసాయ కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, సర్పంచి వేముల శ్రీనివాస్, స్థానిక ఎంపీటీసి వేముల వెంకటరమణ, ఆప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, నాయకులు కునాధరాజు రంగరాజు, వేముల రామన్న, వరదా గోపాలం, కోమలి సత్యనారా యణ, గంటి నాగేశ్వరరావు, కుండా లక్ష్మణరావు, కొత్తపేట ఎంపీపీ మార్గాని గంగాధర్, సురేష్ రాజు, కరుటూరి బ్రహ్మాజీ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి అంటే జూదం కాదు

విశాలాంధ్ర - పాలకొల్లు: సంక్రాంతి అంటే కోడిపందాలు జూదాలు కాదని, సంక్రాంతి అంటే సాంప్రదాయ క్రీడలతో, ముగ్గులు, హరిదాసు కీర్తనలు తెలుగింటి వంటలు కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయత అనురాగాలతో గడపాలని పాలకొల్లు ఎమ్మెల్యే డా.నిమ్మల రామానాయుడు అన్నారు. అలాంటి సదుద్దేశంతోటే, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తన తండ్రి పేరు మీద స్థాపించిన ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. మంగళవారం పాలకొల్లు మండల స్థాయి ముగ్గుల పోటీలు లంకలకోడేరు గ్రామంలో ధర్మ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు.ఈ పోటీలలో మొదటి బహుమతి దగ్గులూరు గ్రామానికి చెందిన తమ్మ దుర్గభవాని గెలుపొందగా, 2వ బహుమతి ని, గవరపేట కు చెందిన దాడి బీమేశ్వరి గెలుపొందారు. లంకలకోడేరు గ్రామానికి చెందిన కుడక అన్నపూర్ణ తృతీయ బహుమతి పొందారు. విజేతలకు బహుమతులను పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా అందజేశారు.

టీడీపీ కార్యకర్తలకు రుణపడి ఉంటా

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని వాడపల్లి కాలనీ వద్ద ఆయన క్యాంపు కార్యాలయంలో బొరగం శ్రీనివాసులు పుట్టిన రోజును పురస్కరించుకొని టిడిపి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రీనివాసులు పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 7మండలాల తెలుగుదేశం కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కోలాహలంగా బొరగం ను గజమాలతో సన్మానించి 100 కేజీల కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ తన వెంట ఉంటూ తనను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ గ్రంధాలయ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, మద్దిపాటి వెంకట రాజు, కోళ్ళ నాగేశ్వరరావు అధిక సంఖ్యలో టిడిపి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో నెంబర్ వన్ రద్దు చేయాలని అంగన్వాడి కార్యకర్తల నిరసన

విశాలాంధ్ర-ఉంగుటూరు: ప్రజా ఉద్యమాలను అణిచివేయడం కోసం తెచ్చిన జి.ఓ.నం.1ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు ఆ కాపీని దగ్ధం చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడి కార్యకర్తలు ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దీ సేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఏవి రమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పది రూపాయల నాణేలతో మోటార్ సైకిల్ కొనుగోలు

విశాలాంధ్ర - తణుకు : తణుకు పట్టణానికి చెందిన ఒక యువకుడు రూ. 1.65 లక్షల విలువైన రూ.10 నాణేలతో మోటార్ సైకిల్ కొనుగోలు చేశారు. పట్టణంలోని వంటేద్దు సోమ సుందర్రావు హీరో షోరూంలో మంగళవారం ఉదయం బొబ్బిలి రాఘవేంద్ర కొనుగోలు చేశారు. సాధారణంగా 10 రూపాయల కాయిన్ లు చెల్లుబాటు కావడం లేదని అపోహలు నేపథ్యంలో కొనుగోలుదారుని నుంచి కాయిన్ లు స్వీకరించామని షోరూమ్ అధినేత వెంకట్ తెలియజేశారు.

సంక్షేమ రథసారథి జగన్‌కే అన్ని వర్గాల మద్దతు

విశాలాంధ్ర - ముదినేపల్లి : సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కే అన్ని వర్గాల మద్దతు ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఈడేపల్లి , సీతారాంపురం లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ఆకాంక్షల మేరకు పనిచేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని మరోసారి మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఇంటికి లబ్ది చేకూరెలా ఇంటి నిర్మాణం, ఇంటి స్థలం , చేయూత, ఆసరా , అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన తదితర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈడేపల్లి సర్పంచ్ అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, కొర్రగుంటపాలెం సర్పంచ్ పెరే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడిపందాలు పేకాట నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని జీలుగుమిల్లి తహసిల్దార్ గద్దం ఎలీషా అన్నారు. మంగళవారం పి. అంకంపాలెం సచివాలయం వద్ద ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పేకాట, కోడిపందాలు ఎక్కడైనా నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాలి శ్రీను, హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు, విఆర్వో లు ముత్యం అశోక్, కుమార్, పంచాయతీ కార్యదర్శి దేవ ప్రియుడు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఖోఖో పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె క్రీడా ప్రాంగణంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ సహకారంతో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఖో-ఖో టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగింది. మంగళవారం జరిగిన పోటీలలో నిజమాబాద్‌లోని తెలంగాణ యూనివర్శిటీపై ధర్వాడ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ 19-08 స్కోర్ తేడాతోను, శ్రీకాకుళంలోని డా బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీపై కోయంబత్తూర్‌లోని భారతీయార్ యూనివర్శిటీ 22-09 స్కోర్ తేడాతో గెలుపొందినట్లు జెఎన్‌టియుకె యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ & టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా జి శ్యామ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్శిటీపై గుంటూరు లోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ 25-10 స్కోర్ తేడాతోను, బెంగుళూర్‌లోని యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌పై మధురైలోని మధురై కామరాజ్ యూనివర్శిటీ 18-12 స్కోర్ తేడాతోను, బళ్లారిలోని విజయనగర శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటీపై కేరళ రాష్ట్రం కన్నూర్‌లోని కన్నూర్ యూనివర్శిటీ 13-12 స్కోర్ తేడాతో గెలుపొందాయి. కొట్టాయంలోని మహాత్మా గాంధీ యూనివర్శిటీపై మైసూరులోని యూనివర్శిటీ ఆఫ్ మైసూర్ 15-13 స్కోర్ తేడాతోను, కడపలోని యోగి వేమన యూనివర్శిటీపై కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ 18-03 స్కోర్ తేడాతోను, కేరళ రాష్ట్రం కన్నూర్‌లోని కన్నూర్ యూనివర్శిటీపై తమిళనాడులోని తిరువళ్లువార్ యూనివర్శిటీ 11-10 స్కోర్ తేడాతోను, సేలంలోని పెరియార్ యూనివర్శిటీపై బెళగావిలోని రాణి చెన్నమ్మ యూనివర్శిటీ 20-16 స్కోర్ తేడాతో గెలుపొందాయి. కర్ణాటకలోని విశ్వేశ్వరాయ టెక్నలాజికల్ యూనివర్శిటీపై అనంత పురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ 15-13 స్కోర్ తేడాతోను, చెన్నైలోని ఎం.జి.ఆర్.ఎడ్యుకేషనల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌పై ధర్వాడ్‌లోని కర్ణాటక యూనివర్శిటీ 18-08 స్కోర్ తేడాతోను, గుంటూరులోని విజ్ఞాన్స్ యూనివర్శిటీపై విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ 19-03 స్కోర్ తేడాతోను, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీపై హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ 21-10 స్కోర్ తేడాతోను, గుంటూరులోని కెఎల్ యూనివర్శిటీ కేరళలోని కేరళ యూనివర్శిటీ 21-05 స్కోర్ తేడాతోను, పుదుచ్చేరిలోని పాండిచ్చేరి యూనివర్శిటీపై వరంగల్‌లోని కాకతీయ యూనివర్శిటీ 14-13 స్కోర్ తేడాతోను, అనంతపురంలోని జెఎన్‌టియుఏపై కేరళలోని ఏపిజె అబ్దుల్ కలాం టెక్నలాజికల్ యూనివర్శిటీ 25-17 స్కోర్ తేడాతో గెలుపొందాయి. అలాగే బెంగుళూర్‌లోని బెంగుళూర్ యూనివర్శిటీపై సేలంలోని వినాయక మిషన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ 22-02 స్కోర్ తేడాతోను, కర్ణాటక రాష్ట్రం తుముకూరులోని తుముకూర్ యూనివర్శిటీపై చెన్నైలోని యూనివర్శిటీ ఆఫ్ మద్రాస్ 13-12 స్కోర్ తేడాతోను, బెంగుళూరులోని బెంగుళూర్ సిటీ యూనివర్శిటీపై చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ & స్పోర్ట్స్ యూనివర్శిటీ 24-16 స్కోర్ తేడాతోను, సేలంలోని నాయక మిషన్స్ రీసెర్చ్ ఫౌండేషన్‌పై బెళగావిలోని రాణి చెన్నమ్మ యూనివర్శిటీ 15-14 స్కోర్ తేడాతోను, బెంగుళూర్‌లోని యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌పై హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ 16-02 స్కోర్ తేడాతోను, కేరళలోని ఏపిజె అబ్దుల్ కలాం టెక్నలాజికల్ యూనివర్శిటీపై అనంతపురం లోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ 14-13 స్కోర్ తేడాతో గెలుపొందినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి. శ్యామ్‌కుమార్ తెలిపారు.

జీవో 1కు వ్యతిరేకంగా పోరాటం

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రజా వ్యతిరేకత పెరుగుతుందని ప్రతిపక్షాలు ఉద్యమాలు, రోడ్ షోలు చేయకుండా కఠినంగా అణచి వేయాలని కాలం చెల్లిన బ్రిటిష్ చట్టం తీసుకొచ్చారని వీరవాస రంలో జరిగిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో జనసేన మండలాధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ మండలంలో అన్ని పార్టీలు కలసి జీవో 1 రద్దుకు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని, సంక్రాంతి భోగి మంటలలో జీవో 1 కాపీలు వేసి పండగ చేసుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం అధికార ప్రతినిది వీరవల్లి చంద్రశేఖర్, బిజెపి మండలాధ్యక్షుడు కోడి నరసింహం, కొల్లు వెంకట్రావు, నరేష్, సిపిఎం నాయకులు రెడ్డి రామారావు, బొబ్బనపల్లి సూర్య చంద్రరావు, జనసేన నాయకులు గుండా బాబు, యర్రంశెట్టి శీనయ్య, దుర్గా ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కాలేడు

విశాలాంధ్ర - పాలకొల్లు : సొంతగా పార్టీ పెట్టినంత మాత్రాన పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కాలేరని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి యడ్ల తాతాజీ విమర్శించారు. పాలకొల్లులో ఆయన కార్యాలయంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో తాతాజీ మాట్లాడుతూ ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలంటే ప్రజలకు ఎన్నో సేవలు చేయాలని, ప్రజల మనసుల్లో నిలిచిపోవాలన్నారు. రాష్ట్రంలో అలాంటి చరిష్మా ఉన్న నాయకుడు జగన్ ఒక్కరే అన్నారు. ప్రస్తుత జనసేన అధినేత చేష్టలు గమనిస్తే, అసలు జనసేన పార్టీ స్థాపించింది చంద్రబాబు కోసమేనా అనే సందేహం అందరిలోనూ కలుగుతోందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకూ సమన్యాయం చేస్తున్న జగన్ రాబోయే ఎన్నికల్లో విజయ దుందుభి మ్రోగిస్తారన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-వీరవాసరం: యువత ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని భీమవరం రూరల్ సీఐ సిహెచ్.నాగప్రసాద్ అన్నారు. మండల కేంద్రం వీరవాసరంలో మద్దాల రామకృష్ణమ్మ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక పాలిటెక్నికల్ కళాశాల గ్రౌండ్ లో మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సాంప్రదాయ క్రీడలపై దృష్టి పెట్టాలని, చెడు మార్గాలు పట్టకుండా, కోడిపందాలు, జూదం ఆడకుండా సంప్రదాయ క్రీడల పట్ల మొగ్గు చూపాలన్నారు. మరో అతిథి వీరవాసరం ఎస్ఐ పి.రమేష్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. సంక్రాంతి సమయంలో ఇటువంటి క్రీడలను ప్రోత్సాహించడం ద్వారా యువత జూద క్రీడల వైపు దృష్టి సారించకుండా సాంస్కృతిక క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు. దీని ద్వారా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 50వేల రూపాయలు, ద్వితీయ బహుమతి 25వేల రూపాయలు, తృతీయ బహుమతి 10వేల రూపాయలు అందజేయ నున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు కేశవ 994821117, మణి 9652991888, సెల్వరాజ్ 9912555,675 నెంబర్లలో టీం పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర -భీమవరం టౌన్: చిరు వ్యాపారులకు తమ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిఆర్డిఏ పిడి ఎమ్ఎస్ఎన్ వేణు గోపాల్‌తో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ అన్న తోడు కార్యక్రమంలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి జగన్ చిరు వ్యాపారుల ఖాతాల్లో వడ్డీ డబ్బులను జమ చేయనున్నారని పేర్కొన్నారు. భీమవరం నియోజవర్గంలో 5 వేల మంది చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించగా, వారు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని నేడు తమ ప్రభుత్వం చిరు వ్యాపారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందన్నారు. జగనన్న తోడు పథకం వల్ల చిరు వ్యాపారులకు భీమవరం నియోజకవర్గంలో రూ.12 లక్షల మేరకు లబ్ది జరుగుతుందన్నారు.చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని తమ కుటుంబాలను పోషించుకోవడానికి గాను వడ్డీకి అప్పులు తెచ్చి వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో, సాయంత్రం అయ్యేసరికి వచ్చిన ఆదాయం వడ్డీ కట్టడానికే సరిపోతుందని ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో గుర్తించారన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, కోమటి రాంబాబు, నామన మహేష్ పాల్గొన్నారు.

70 కిలోల వెండి మకర తోరణాలు వితరణ

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని పుల్లేటికుర్రు గ్రామ పంచాయతీ వ్యాఘ్రేశ్వరంలో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ వ్యాఘ్రేశ్వర స్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు 70 కిలోల వెండితో సుమారుగా ఆరులక్షల రూపాయల వ్యయంతో రెండు మకర తోరణాలు దాతల సహకారంతో సర్వేజనా సుఖినో భవంతు ట్రస్టు ఆధ్వర్యంలో ధనుర్మాసంలో మంగళవారం సంకట చతుర్దినాడు సంప్రోక్షం చేయించి బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు, గ్రామ సర్పంచ్ జల్లి బాలరాజు, ట్రస్టు చైర్మన్ అయ్యగారి వ్యాఘ్రేశ్వర సతీష్ రాజు, ప్రధాన కార్యదర్శి వక్కలంక రాధాక్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్, లీగల్ అడ్వయిజర్ పొన్నాడ విశ్వనాథ్ రాజు, సీనియర్ సిటిజన్స్ బీర సూర్య ప్రకాశరావు, కుడుపూడి సత్యనారాయణ, బీర జగన్నాధం, అయ్యగారి వెంకట్రామయ్య, కాకర్ల నరసింహ రావు, బెహారా హనుమంత రావు, వాడ్రేవు రాంబాబు, అయ్యగారి వెంకటరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యను దూరం చేసిన ఘనత జగన్‌దే

విశాలాంధ్ర - దేవరపల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని గోపాలపురం నియోజకవర్గ జనసేన నాయకులు దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపురంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ క్యాలెండర్‌ను సువర్ణరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77, 55 జీవోలను తీసుకువచ్చి గ్రామీణ ప్రాంత ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీలకు చెందిన పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేశారని, పీజీ కోర్సులు చేయదానికి స్కాలర్ షిప్‌లు పొందదానికి పేద విద్యార్థులకు ఈ జీవోల వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కోర్సులలో జీవో నెంబర్ 55 తీసుకువచ్చి కొత్తగా మేనేజ్మెంట్ కోటాను తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాక్షస పరిపాలన పోవాలంటే జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసి, జనసేన ద్వారా ఆయా వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు జన సైనికులు ప్రజల మధ్య ఉండి ప్రభుత్వ నియంత దుష్ట పాలనను ఎండగట్టాలని జనసైనికులకు సువర్ణరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలమాటి నాని బాబు, చప్పటి శివనాగ ప్రసాద్, కంబాల సత్తిబాబు, ఎం. సతీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేం కర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తాళ్లరేవు పంచాయతీలో ముమ్మిడివరం నియో జకవర్గం మాజీ శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఆదేశానుసారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం రోళ్ళ వారి వీధి, మాదవరాయుని పేట, గాంధీ నగర్, కేశవపురం కోలనీలో కార్యక్రమం జరిగింది. వైయస్సార్ ప్రభుత్వం లో అన్ని వర్గాల ప్రజలు మోసపోయామని, ప్రజలు ఎలక్షన్‌లు ఎప్పుడు వచ్చినా ఈ ప్రభుత్వంకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఇంటి ఇంటికి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాశంశెట్టి శ్రీనివాసరావు, రోళ్ళ శ్రీనివాస చక్రవర్తి, నడింపల్లి సూర్యనారాయణ రాజు, గాదిరాజు సతీష్, బందారు శ్రీను, కుడిపూడి రామకృష్ణ, వడ్డి విజయ్, బుల్లెట్ జానీ, దాసరి వేణు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్, ధూళిపూడి వెంకటరమణ (బాబి) తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి 3 చక్రాల సైకిల్ అందజేత

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని లంకల గన్నవరం గ్రామానికి చెందిన కోలా సూర్యనారాయణ అనే దివ్యాంగుడికి జనసేన పార్టీ తరపున ఆ పార్టీ నాయకులు 3 చక్రాల సైకిల్‌ను అందజేశారు. గ్రామంలో ఈనెల 12న శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే బహిరంగ సభ పై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు సాధనాల జేడి జనసేన నాయకులు యడ్ల ఏసు, యల్లమెల్లి చిట్టిబాబు, తాటికాయల శ్రీను, గనిశెట్టి శ్రీనివాస్, షేక్ దొరబాబు, యర్రంశెట్టి రమణ (టివి), గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు, స్పోర్ట్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రగతి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, విద్యార్థి దశలో విద్యార్థులందరూ క్రమశిక్షణ, ప్రతిభ, అకుంఠిత దీక్షతో పాటు సేవా తత్పరత కలిగి ఉండాలని తెలియజేసారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా మన సాంప్రదాయాలను గుర్తు చేస్తూ విద్యార్థినీ, విద్యార్థులందరికీ రంగోలీ, గాలిపటాలను ఎగురవేసే పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతలు అందజేసారు. ఈ కార్యక్రమాలలో భాగంగా కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు త్రోబాల్, వాలీబాల్, క్రికెట్, జావెలిన్ త్రో షాట్పుట్, 100 మీ., 400 మీ. & 800 మీ. రన్నింగ్ వంటి వివిధ గేమ్స్ నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు తమ ఆనందాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాథబాబు, డైరక్టర్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎమ్ సతీష్, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.